ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 9 మార్చి 2024



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

శివాయ.. రుద్రాయ

- అంతటా శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కిక్కిరిసిన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి
- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



పట్టు వస్త్రాలు తెస్తున్న గోపిరెడ్డి దంపతులు

ఓం నమః శివాయ.. శంభో శంకరా.. శివాయ రుద్రాయ.. నామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినం.. కోటయ్యస్వామి తిరునాళ్లతో శుక్రవారం భక్తులు పులకించి.. తరించారు. శైవక్షేత్రాలు భక్తజనంతో నిండిపోయాయి. శివయ్య దర్శనానికి భక్త జనసందోహం పోటెత్తింది. స్వామి వార్లను దర్శించుకుని భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వీఐపీలు, ప్రముఖుల తాకిడితో కోటప్పకొండ, క్వారీ, గోవాడలతో పాటు అమరావతి, పెదకాకాని ఆలయాలు కిటకిటలాడాయి. విద్యుత్ దీపాలంకరణలతో నిర్మించిన ప్రభలను ఉత్సవంగా ఆలయాల వద్దకు భక్తులు తరలించారు. హర.. హరా.. చేదుకో కోటయ్య.. చేదుకో వయ్యా.. అంటూ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు కోటయ్య క్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చారు. త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది.

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: ప్రఖ్యాత శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి శుక్రవారం భక్తులతో పోటెత్తింది. కొండ ప్రాంత మంతా జన సంద్రమైంది. సాయంత్రం నుంచి యాత్రికుల రద్దీ అంతకంతకు పెరిగింది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో స్వామికి ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టు వస్త్రాలు, వెండి ప్రభను సమర్పించారు. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు జరిపి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన బొచ్చు కోటయ్యస్వామి వద్ద తల నీలాలను భక్తులు సమర్పించారు. కొండపైన ఉన్న పాతకోటేశ్వర స్వామి, పాపవినాశేశ్వర స్వామి, దిగువన ఉన్న విఘ్నేశ్వరస్వామి, సోపానమార్గంలోని ఆనందవల్లి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ధ్యాన శివుడు, విఘ్నేశ్వరుడు, నంది, నాగేంద్రస్వామి పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. రెండు అభిషేక మండపాల్లో వేలాది మంది భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 3,000 పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, ఐజీ పాలరాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఆర్డీవో సరోజ డీఎస్పీ వర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి 528కి పైగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను కొండకు ఏర్పాటు చేశారు. యాత్రికులకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు సత్యసాయి సేవా సమితి, స్కౌట్ విద్యార్థులు క్యూల్లోని భక్తులకు మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండ దిగువన పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల కళా పరిషత్, నవ భారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి నిర్వహించారు. కొండ దిగువన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

కనువిందు చేసిన ప్రభలు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 21 భారీ విద్యుత్ ప్రభలు కొండలో కొలువు దీరాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. చిలకలూరిపేట రహదారిలో విద్యుత్ ప్రభల ఉత్సవం శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభలతో కోలాహలం నెలకుంది. ఆలయం, ప్రభల వెలుగులతో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభల విద్యుత్ కాంతులు భక్తులకు కనువిందు చేశాయి. తెల్లవార్లు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ట్రాఫిక్ జామ్.. భక్తులు అవస్థలు

కోటప్పకొండ ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామైంది. వీఐపీ బస్సు బ్రేక్ డౌన్‌తో పెద్దసంఖ్యలో బస్సులు నిలిచిపోయాయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటన్నర పాటు బస్సులు లేక భక్తులు అల్లాడిపోయారు. నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులో గురవపాలెం సమీపంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొండకు వెళ్లే భక్తులకు ట్రాఫిక్ కష్టాలు ఎదురయ్యాయి. పోలీసులు వన్ వే నిర్వహించినా వాహన చోదకులు నిబంధన పాటించకపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్ జామైంది. పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద వినుకొండ రోడ్డులో కొండకు ప్రభను తరలిస్తున్న సమయంలో సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.



కోటప్పకొండపై భక్తుల రద్దీ

వేల్లో పాసులు.. ఆదాయానికి గండి

త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వీఐపీ, వీవీఐపీ పాసులను పెద్దసంఖ్యలో జారీ చేశారు. డీఆర్వో కార్యాలయం నుంచి 20 వేలకు పైగా పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. ఒక్కొక్క వీఐపీ వెంట అధిక సంఖ్యలో వారి అనుచరులు తరలివచ్చారు. వీఐపీల కారణంగా ఉచిత, రూ100 క్యూల్లోని భక్తులు స్వామిదర్శనం కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా వీఐపీ పాసుల జారీతో ఆలయ ఆదాయానికి గండి పడింది. వీఐపీల వాహనాలను కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు.





గోవాడలో మహిళల పొంగళ్లు

గోవాడకు భక్తుల తాకిడి

అమృతలూరు: ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం భక్త జన సందోహంతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు అనంతరం అర్ధరాత్రి 1 గంట నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి దర్శనానికి శుక్రవారం ఉదయం నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. అభిషేక మండపంలో అభిషేకాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో భక్తుల రద్దీ నెలకుంది. ట్రాక్టర్లపై రైతులు తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులకు తాగునీటి ప్యాకెట్లు, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు. సామాజిక సత్రాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.





స్వామి వారి అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



కొండ ఘాట్‌రోడ్డులో ఆగిపోయిన బస్సు





- ప్రభల వద్ద రికార్డింగ్ డాన్సులు



భక్తులకు దారి పొడవునా ట్రాఫిక్ కష్టాలే...

అమరేశ్వరుడికి అభిషేకాలు

అమరావతి: పంచారామాల్లో ప్రసిద్ధమైన అమరారామంలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి బిందె తీర్థం, అభిషేకాలు జరిగాయి. కృష్ణానదిలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షవర్ల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకు నేందుకు క్యూల్లో బారులు తీరారు. లింగోద్భవకాలంలో అభిషేకాలు జరిగాయి.



అమరావతిలో భక్తుల క్యూ

క్వారీకి పోటెత్తిన భక్తులు

పొన్నూరుటౌన్: మహిమాన్విత శైవక్షేత్రం క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. చేబ్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పొంగళ్లను వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వడ్లమూడి నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్ధపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించి స్వామి ఆలయానికి తరలించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచి నీరు, మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ జరిగింది. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పలు ప్రభల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



క్వారీలో సుద్దపల్లి యాదవపాలెం విద్యుత్ ప్రభ

కాకాని మల్లన్నసన్నిధి.. కిటకిట

పెదకాకాని: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకానిలోని మల్లన్నసన్నిధి భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయం ఎదుట ఉన్న యజ్ఞాల బావి వద్ద భక్తులు పవిత్ర స్నానం ఆచరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి మల్లేశ్వరస్వామి వారికి అభిషేకాలు జరిపించారు, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో వేదపండితులు అభిషేకాన్ని జరిపించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో భక్తులు పరవశించి పోయారు. గజవాహనంపై ఉభయదేవేరి సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.



పెదకాకాని మల్లికార్జునుడి సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు

గ్రానైట్ ఫ్యాక్టరీలపై దాడులకు.. సిద్ధం

- టీడీపీ సానుభూతిపరుల ఆర్థికమూలాలే లక్ష్యం
- సిద్ధం సభ విజయవంతానికి సహకరించనందుకేనా?
- వేధింపులతో మూసివేతకు గ్రానైట్ అసోసియేషన్ నిర్ణయం



బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఒకసారి వాయిదా పడిన సిద్ధం సభ.. ఆదివారం జరగనున్న మేదరమెట్ల సిద్ధం సభకు ఆశించిన స్థాయిలో జనం రారేమోనని వైసీపీ నేతల్లో భయం నెలకొంది. ఈ నేపథ్యంలో జనసమీకరణతో పాటు ఆర్థిక అండదండలు అందించే వారిపై ప్రభుత్వం కన్నేసింది. ఈ క్రమంలో సభ జరగనున్న అద్దంకి పరిధిలోని బల్లికురవ, పర్చూరు, మార్టూరుల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీల్లోని యజమానులపై సభ విజయవంతానికి సహకరించాలని ఒత్తిడి తెచ్చింది. అయితే వారు అందుకు ససేమిరా అన్నారు. దీంతో జిల్లా పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలలో తనిఖీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సిద్ధం సభ ముగిసిన మరుసటి రోజే (మార్చి 11) విజిలెన్స్ తనిఖీలకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. టీడీపీ సానుభూతి పరుల ఆర్థిక మూలాలే లక్ష్యంగా ఈ దాడులకు ప్రభుత్వం సిద్ధమైందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వేధింపులను తట్టుకోలేమంటూ ఫ్యాక్టరీల మూసివేతకు గ్రానైట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. మార్టూరు తనిఖీల ఎపిసోడ్‌లో వివాదస్పద వైఖరితో విమర్శలు ఎదుర్కొన్న అధికారులనే సోమవారం చేపట్టే తనిఖీలకు ప్రభుత్వం నియమించింది. తనిఖీలలో ఏడుగురు చొప్పున ఏర్పాటు చేసిన రెండు బృందాలకు మచిలీపట్నం మైనింగ్ అధికారి ప్రతాప్‌రెడ్డి, నెల్లూరు జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీనాయక్ నేతృత్వం వహించనున్నట్లు సమాచారం. మళ్లీ ఇప్పుడు వారికే తనిఖీ బాధ్యతలు అప్పగించడం అంటే పాలకపార్టీ బరితెగింపు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని టీడీపీ విమర్శిస్తోంది.

మా వల్ల కాదు.. మూసివేస్తాం...

అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ వేల మంది ఉపాధిని దృష్టిలో పెట్టుకుని గ్రానైట్ ఫ్యాక్టరీలను నడుపుతున్నామని, కానీ తమ వెతలను పట్టించుకోకపోగా దాడుల పేరిట భయభ్రాంతులకు గురిచేయడాన్ని గ్రానైట్ అసోసియేషన్ తప్పుబట్టింది. ప్రభుత్వ తనిఖీల ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో మార్టూరులో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం సమావేశమై మూసివేత నిర్ణయం తీసుకుంది. 11న ప్రభుత్వ తనిఖీలకు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో సిద్ధం సభ జరిగే 10 నుంచే ఫ్యాక్టరీలను నిరవధికంగా మూసివేసి తమ నిరసన తెలపాలని వారు నిర్ణయించుకున్నారు. 500 గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు, 30 క్వారీల మూసివేతతో వేల మంది ఉపాధికి గండపడనున్నది.

గతంలో మారణాయుధాలతో సోదాలు..

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లక్ష్యంగా జనవరి 30న ప్రభుత్వం మైనింగ్ అధికారులను దాడులకు ఉసిగొల్పిన సంగతి తెలిసిందే. తనిఖీల పేరిట ప్రైవేటు సైన్యాన్ని వెంటేసుకుని మారణాయుధాలతో సదరు అధికారులు వ్యవహరించిన తీరు తీవ్ర వివాదస్పదమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బాధితులుగా మిగిలిన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులనే నిందితులుగా చేర్చి కేసు నమోదు చేయడం, ఎమ్మెల్యే ఏలూరి అరెస్టుకు కూడా పోలీసులు యత్నించడం ఆనక కోర్టు చీవాట్లతో నోటీసులతో సరిపెట్టి మొత్తం తనిఖీల వ్యవహారాన్నే అపహాస్యం చేసిన ఘనతను ప్రభుత్వం మూటగట్టుకుంది. ఇక అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గ్రానైట్ వ్యాపారాల విషయంలో ప్రభుత్వ వేధింపులు నాలుగేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి.

దిక్సూచి

'ప్లానింగ్'లో పీజీ



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తి చేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Op0mxNDలో చదవండి.



సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా లఫూట్



నందమూరి బాలకృష్ణ దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను మహా శివరాత్రి సందర్భంగా విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌తో రూపొందించిన ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ కూల్‌గా, ప్రశాంతంగా కనిపిస్తూనే తనదైన శైలిలో పవర్‌ఫుల్ డైలాగ్‌తో అదరగొట్టారు. కొంతమంది గూండాలు తన వైపు పరిగెత్తుకుని వస్తుంటే బాలయ్య కూల్‌గా ఆల్కహాల్ తాగుతుండడం ఆకట్టుకుంది. 'ఏంట్రా వార్ డిక్లేర్ చేస్తున్నావా' అని వచ్చిన వాళ్లలో ఒకడు అడిగితే 'సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా.. ఇట్స్ కాల్డ్ హంటింగ్' అంటూ పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పి బాలకృష్ణ వేట మొదలుపెట్టడం గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ గ్లింప్స్ బాలకృష్ణ అభిమానుల్ని, సినీ ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఇందులో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. థమన్, ఫొటోగ్రఫీ: విజయ్ కార్తిక్, ఎడిటింగ్: నిరంజన్, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య

భైరవుడై.. రక్షకుడై...



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కల్కి 2898 ఏడీ'. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ చిత్రం నుంచి ప్రభాస్ పాత్రను యూనిట్ పరిచయం చేసింది. భైరవగా సరికొత్త లుక్‌లో ప్రభాస్ అలరించారు. భవిష్యత్తులో కాశీ నగరంలో జరిగే కొన్ని సంఘటనల నేపథ్యంలో సాగిన ప్రత్యేక వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది. కాశీ ప్రజలను విలన్ల నుంచి కాపాడే రక్షకుడిగా ప్రభాస్ కనిపించారు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో అలరించనున్నారు. అమితాబ్‌బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇటలీలో ప్రభాస్, దిశా పటానీపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు.

ధనుష్ కుబేర



జాతీయ అవార్డు చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న తాజా చిత్రానికి టైటిల్ నిర్ణయించారు. ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు 'కుబేర' అని పేరు పెట్టారు. మహాశివరాత్రి సందర్భంగా సినిమా టైటిల్ వెల్లడించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అత్యంత సంపన్నుడైన దేవుడు కుబేరుడు. ఆయన పేరునే ఈ సినిమాకు పెట్టారు. కానీ విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ లుక్ టైటిల్‌కు భిన్నంగా ఉంది. చిరిగిన బట్టలతో అన్నపూర్ణా దేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న పెయింటింగ్ ముందు ధనుష్ నిలబడి కనిపించారు. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో అనే ఆసక్తి పెరిగింది. అలాగే మరో కీలక పాత్ర పోషిస్తున్న నాగార్జున లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. రష్మిక ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

కాశీలో శివశక్తి



తమన్నా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఇటీవలే కాశీలో చిత్రీకరణ ప్రారంభమైంది. అశోక్‌తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. ఇందులో తమన్నా శివశక్తి అనే పాత్ర పోషిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నాగా సాధువు అవతారంలో తమన్నా సరికొత్తగా కనిపించారు. ఈచిత్రంలో హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అదిగో కన్నప్ప



పరమశివుని భక్తుడు కన్నప్ప జీవితగాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం నుంచి కన్నప్ప పాత్రధారిగా విష్ణు ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. విల్లు ఎక్కుపెట్టిన భంగిమలో శక్తిమంతంగా కనిపించి ఆకట్టుకున్నారు. 'గొప్ప శివభక్తుని పాత్రలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదిగో మీ కన్నప్ప.. హర హర మహదేవ్' అని విష్ణు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ దర్శకుడు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్ పరమశివుని పాత్ర పోషిస్తున్నారు. శరత్‌కుమార్, మోహన్‌లాల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

ఎనిమిది భాగాలుగా హాఫ్ లయన్


ప్రకాశ్ ఝా

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఆహా' 'హాఫ్ లయన్' పేరుతో వెబ్‌సిరీస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. వినయ్ సీతాపతి రచన 'హాఫ్ లయన్' పుస్తకం దీనికి ఆధారం. ప్రకాశ్ ఝా దర్శకత్వంలో ఆహా స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సిరీస్ గురించి ఓ ఇంటర్వ్యూలో ప్రకాశ్ ఝా మాట్లాడుతూ 'పీవీ నరసింహారావు ప్రధానిగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి ఆంధ్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన జీవితంలోని కీలకఘట్టాలను స్పృశిస్తూ ఈ సిరీస్ సాగుతుంది. 'తెలుగువాళ్లు గర్వించే వ్యక్తి పీవీ, ఆయన బయోపిక్ చేద్దాం' అని నిర్మాత అల్లు అరవింద్ నన్ను కలిశారు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అని చెప్పారు. ఈ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లుగా ఉంటుంది, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది అని ఆహా సహ వ్యవస్థాపకులు అజిత్ ఠాకూర్ చెప్పారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్ తెరకెక్కిస్తున్నాం, త్వరలో నటీనటుల ఎంపిక ప్రారంభించి, ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రీకరణ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.





వచ్చేనెల 7వ తేదీ వరకు 12 రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు 12 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07783 విజయవాడ - గుంటూరు, 07788 గుంటూరు - విజయవాడ, 07779 గుంటూరు - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, నెంబరు. 07579 నడికుడి - మాచర్ల, నెంబరు.07628 విజయవాడ - గుంటూరు, 07464 విజయవాడ - గుంటూరు, 07465 గుంటూరు - విజయవాడ, 07786 గుంటూరు - రేపల్లె, 07873 రేపల్లె - తెనాలి, 07630 తెనాలి - విజయవాడ రైళ్లను ఏప్రిల్ 7వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. నెంబరు. 17282 నరసపూర్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ విజయవాడ వరకే ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ కారణంగా నెంబరు. 17281 గుంటూరు - నరసపూర్ రైలు విజయవాడ నుంచి నరసపూర్‌కు వరకు వెళుతుందన్నారు.

రైలు కింద పడి ఇద్దరి మృతి

వినుకొండటౌన్, మార్చి8: ప్రమాదవశాత్తు రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన ఇందిరానగర్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బహిర్భూమికి వచ్చి ప్రమావద వశాత్తు రైలుకింద పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 65 సంవత్సరాలు ఉండవచ్చని, శరీరంపై తెల్లటి చొక్క, పంచె ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆచూకి తెలిసిన వారు 9440438256 ఫోన్ నెంబర్ సంప్రదించాలన్నారు. అదేవిధంగా కురిచేడు సమీపంలో సాఫ్టవేర్ ఉద్యోగి యర్రగొండ రవికుమార్ (38)అనే యువకుడు రైలు క్రింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రకాశంజిల్లా, దర్శి మండలం తానంచితలకు చెందిన వ్యక్తిగా గుర్తించి, బంధువులకు సమాచారం అందినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు.

నవ్యాంధ్ర సుభిక్షంగా ఉండాలి..

● మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


బొప్పూడి ప్రభను సందర్శించిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 8: పాలకుల చేతిలో మోసపోయిన నవ్యాంధ్రను కాపాడాలని, పల్నాడు ప్రజల కొంగు బంగారం త్రికోటేశ్వరుని ప్రార్థించినట్లు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ నాయ కులతో కలసి ఆయన త్రికోటేశ్వరుని దర్శించుకు న్నారు. రాబోయే రోజుల్లో ప్రజల బాధలు తీర్చే సర్కారు రావాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. పరమ శివుడు దక్షణా మూర్తి రూపంలో ఉన్న ఏకైక క్షేత్రం కోటప్పకొండ కావటం ఇక్కడి ప్రజల అదృష్టంగా ఆయన వివరించారు. అనంతరం కావూరు, బొప్పూడి, కమ్మవారిపాలెం, గోవిందాపురం, యడవల్లి, మద్దిరాల, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం, కోమటినేని వారిపాలెంల నుంచి వచ్చిన ప్రభలను సందర్శించి పూజలు నిర్వహించారు. ప్రభలు నిర్మించిన టీడీపీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. అనంతరం కాకతీయ అన్నదాన సత్రంలో అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం నిర్వాహకులు ప్రత్తిపాటిని ఘనంగా సత్కరించారు.

దేవుని వాక్యం బలమైనది

పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్ ● రెండోరోజు భక్తిశ్రద్ధలతో కొనసాగిన గుడారాల పండుగ


రెండవరోజు జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహాం, పాస్టర్ రాజు, హాజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), మార్చి8: దేవుని వాక్యం బలమైనదని, ఆ వాక్యం ద్వారా కుంగినవాడు కూడా విడుదల పొందుతాడని పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్‌లు సందేశమిచ్చారు. గోరంట్ల సమీపంలో జరుగుతున్న 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ రెండోరోజైన శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది విశ్వాసుల పాల్గొన్నారు. ఉదయం ప్రార్థనలను యర్రగొండపాలెంకు చెందిన మోజేష్‌లు ప్రారంభించి సందేశమిచ్చారు. రెండవ ప్రసంగాన్ని నల్గొండకు చెందిన పాస్టర్ సైమన్, ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు సందేశమిచ్చారు. అనంతరం పాస్టర్లు రమేష్, జాన్‌వెస్లీలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనసు మార్చుకుని పరిశుద్ధ ఆత్మతో జీవించాలని సందేశమిచ్చారు. ఈ సందర్భంగా హోసన్న సువార్త గాయకులు ప్రేమ పూర్ణుడా, ఘనమైనవి నా కార్యాలు అనే గీతాలను ఆలపించారు. సాయంత్రం ప్రార్థనలను మచిలీపట్నంకు చెందిన రాజేష్ ప్రారంభించి దేవుని వాక్యాన్ని ఉపదేశించారు. అద్దంకి నుంచి అంధులు చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. అర్ధరాత్రి ప్రార్థనల్లో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహాం ప్రసంగించారు.

ఈ స్థలం పవిత్రమైనది : పెమ్మసాని

ఈ స్థలం పవిత్రమైనదని దీనిని బలపరిచిన హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్లు, నిర్వాహకులను అభినందిస్తున్నట్టు గుంటూరు పార్లమెంటు టీడీపీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు, గోరంట్ల, హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న గుడారాల పండుగ రెండవ రోజున జరిగే ప్రార్థనలలో టీడీపీ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాదు, నక్కా ఆనంద్‌బాబు, బూర్ల రామాంజనేయులు, మద్దిరాల మ్యానీ, ఇతర జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ 1977లో 80 మందితో మొదలైన పండుగ నేడు ఐదు లక్షల మందికి చేరుకోందంటే దాని వెనుక ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉన్నాయన్నారు. శాంతి ప్రేమ పంచడానికి ఏసుక్రీస్తు జన్మించారని ఆయన మార్గంలో నడవాలని కోరారు. కక్షతో గాకుండా క్షమాబిక్షతో జీవించాలని తెలిపారు. దేవుని ఆశీర్వాదం పొంది ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు అనంతరం హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహాం, చీఫ్ పాస్టర్, జాన్‌వెస్లీ, పాస్టర్లు రాజు, రమేష్ ఫ్రైడి పాల్ చేసిన ప్రార్థనల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.

కోటప్పకొండ.. భక్తజనసంద్రం

త్రికూటాద్రిలో తిరునాళ్ల సందడి.. వీఐపీల రద్దీ.. వారి సేవలో అధికారులు.. సత్రాల్లో లక్ష మందికి అన్నప్రసాద వితరణ

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి శుక్రవారం భక్తజన సంద్రంతో నిండిపోయింది. కోటయ్యస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకొని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోపాన మార్గంలో కూడా భక్తులతో రద్దీ నెలకొంది. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలివస్తూనే ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండ ఎగువన, దిగువన ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందలు పంపిణీ చేశారు.

తిరునాళ్లలో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలోని పర్యాటక కేంద్రాన్ని సందర్శిం చారు. ఇక్కడ యాత్రికుల సందడి నెలకుంది. చిన్నారులు, పెద్దలు అందరూ బోట్ షికార్ చేశారు. పిల్లల రాజ్యం పార్కులో చిన్నారులు ఆట వస్తువులతో ఉత్సాహంగా ఆడుకున్నారు. పర్యాటక కేంద్రంలోని జింకలు, పక్షులు, నెమళ్లు, అక్వేరియంలను సందర్శించారు. కొండ దిగువన వున్న స్టాల్స్‌లో ఆట వస్తువులు, చెరకుల విక్రయాలు జరిగాయి. రంగుల రాట్నాలతో యాత్రికులు సందడి చేశారు. కొండ దిగువన పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల కళా పరిషత్, నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి నిర్వహించారు. కొండ దిగువన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

నరసరావుపేట మండలం కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం, చిలతలపాలెం నుంచి ఒక్కొక్క ప్రభ కొండలో కొలువుదీరాయి. పురుషోత్తపట్నం నుంచి 6, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివచ్చాయి. తెల్లవార్లు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణం, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రజలు కొండకు తరలి వచ్చారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

కోటయ్య స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మద్దాళి గిరి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి. కలెక్టర్ శివశంకర్, ఐజీ పాలరాజు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, ఆప్కో ఛైర్మన్ చిరంజీవి తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

పెద్ద ఎత్తున అన్నదానం

కొండ దిగువన ఉన్న సామాజిక సత్రాలలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఒక్కొక్క సత్రంలో వేలాది మందికి అన్నదానం జరిగింది. సత్రాలలో లక్ష మందికి పైగా అన్నదానం జరిగింది. కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ, యోగి వేమారెడ్డి, ముదిరాజులు, శాలివాహన, నాయీబ్రాహ్మణ, రజక, బ్రాహ్మణ, ఆది శైవ, వీర శైవ, విశ్వ బ్రాహ్మణ, తొగటి వీర క్షత్రియ తదితర సామాజిక వర్గాల సత్రాలలో భారీగా అన్నదానం జరిగింది.

ఎన్నికల బాండ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు


మహిళా ప్రణాళికను ఆవిష్కరిస్తున్న వీ శ్రీనివాసరావు, పాశం రామారావు తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 8: ఎన్నికల బాండ్ల రూపంలో ఆయా రాజకీయ పార్టీలకు చేరిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నికల బాండ్లు అనేది పెద్ద అవినీతి అని, దాదాపు రూ.64వేల కోట్ల నల్లధనం ప్రధాన పార్టీల వద్ద ఉందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చెబుతోందని గుర్తుచేశారు. శుక్రవారం గుంటూరు, బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో మహిళ ప్రణాళిక అమలుపై రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి లేకనే మోదీ అయోధ్య రామాలయం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పారదర్శక పాలన కేవలం ఇండియా కూటమితోనే సాధ్యమవుతుందన్నారు. మోదీ, జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, అందుకే మహిళా ప్రణాళిక అమలుకై సీపీఎం ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు డి.లక్ష్మీనారాయణ, ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కోడి పందాలు

● మునమాక, రొంపిచర్ల వద్ద నిర్వహణ
● అధికార పార్టీ నేతల అధ్వర్యంలోనే..


రొంపిచర్ల మండలం మునమాక సమీపంలో కోడి పందాలు

నరసరావుపేట, మార్చి 8: అధికార పార్టీ అండదండలతో శుక్రవారం కోడి పందాలు జోరుగా సాగాయి. వరుసగా ఐదవ ఏడాది పందాలు నిర్వహించి పోలీసు శాఖకు నేతలు సవాలు విసిరారు. సందట్లో సడేమీయా చందాన పోలీసులు కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తులో ఉన్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలు రెండు చోట్ల బరులు ఏర్పాటు చేసి పందాలు నిర్వహించడం గమనార్హం. నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలంలో రెండుచోట్ల పందాలు బహిరంగంగానే జరిగాయి. గతంలో అధికార పార్టీ నేతలు కలసి ఒక చోటే పందాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి అధికార పార్టీ నేతలు ఇరు వర్గాలుగా విడిపోయి రెండు చోట్ల పందాలు నిర్వహించారు. మునమాక సమీపంలో, రొంపిచర్ల వద్ద రెండు చోట్ల పందాలు జరిగాయి. గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్లు పందెంలో పాల్గొన్నట్టు చెబుతున్నారు. మద్యం అమ్మకాలు పెద్దఎత్తున జరిగాయి. ఒక్కో పోటీకి లక్షల్లో చేతులు మారాయి. పోలీసు శాఖకు సమాచారం అందినా మిన్నకున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రొంపిచర్ల మడలంలో మాత్రం శివరాత్రి కోడి పందాలు నిర్వహించడం అధికార పార్టీ అనవాయితీగా కొనసాగిస్తోంది.

తిరునాళ్ళలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

కోటప్పకొండ తిరునాళ్ళలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిగాయి. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు అక్రమార్కులు పంచన చేరిపోయారు. తిరునాళ్ళ సందర్భంగా కోటప్పకొండకు 10 కిలోమీటర్ల వరకు మద్య నిషేదాన్ని ఎక్సైజ్ శాఖ విధించింది. ఇది అమలు కాలేదు. యూటీ సమీపంలోని ప్రభుత్వం మద్యంషాపు నుంచి మద్యం నిల్వలను బయటకు తరలించారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖ దృషికి తీసుకువెళ్ళినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ షాపుకు సంబంధించిన మద్యంను బ్లాక్‌లో విక్రయించారు. పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరిగినా నామమాత్రంగా కూడా సదరు అధికారులు చర్యలు తీసుకోకపోవండంపై వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దాడికి ప్రతీకారం.. పూరిళ్లకు నిప్పు

పిల్లలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఘటన ● 20లక్షల ఆస్తి అగ్నికి ఆహుతి


అహత్యకు ప్రతీకారంగా కాలిపోయిన నాలుగు పూరిళ్లు

వినుకొండ, మార్చి8: అర్ధరాత్రి ముగ్గురు చంటి పిల్లలను హతమార్చాలని గడిపెట్టి ఇంటికి నిప్పు అంటించడంతో, నాలుగుపూరిళ్ళు దగ్ధమై, సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం జరిగిన ఘటన పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. పాములకాలనీకి చెందిన పులి వెంకటేశ్వర్లు, నాగులూరి జంపన్నలు బంధువులు. ఇద్దరి మధ్య గురువారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఇరువురి మధ్య పెద్దమనిషిగా వెళ్లిన పోలా శ్రీనుపై పులి వెంకటేశ్వర్లు అదే రాత్రి కత్తితో దాడిచేశాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీనును చూసి తమ్ముడు పోలా బంగారయ్య శుక్రవారం తెల్లవారుజామున పులి వెంకటేశ్వర్లు ఇంటిని తగలబెట్టాడు. ఇంట్లో నిదరపోతున్న శ్రీనిధి, దివ్య, అపర్ణలను స్థానికులు కాపాడినప్పటికి, పక్కనే ఉన్న పగిడి నారాయణ, పగిడి వెంకటేశ్వర్లు, పులి వెంకటరమణ నివాస గృహలు అగ్నికి ఆహుతయ్యాయి. జరిగిన ఘటనపై ఎస్ఐ ప్రసాద్‌ను వివరణ కోరగా సీఐ దృష్టికి తెచ్చామని, సీఐ కోటప్పకొండ బందోబస్తులో ఉన్నారని తెలిపారు. .



అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టారు

చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

● 1543 రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి 8: రాష్ట్ర బాగోగులు గాలికి వదిలేసి, సంపద కేంద్రం రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారని 33వేల ఎకరాలు అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, మూడు రాజధానులు వద్దు, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1543వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, అమరావతిని అభివృద్ధి చేయటం చేతకాని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతామని అనటం విడ్డూరంగా ఉందన్నారు. వేల ఎకరాలు భూములిస్తే అమరావతి నిర్మాణం కొనసాగించలేకపోవటం సిగ్గు చేటన్నారు. మూడు ముక్కల ఆటతో అధోగతి పాలు జేశారన్నారు. అధర్మంగా పాలించబట్టే వందల సార్లు వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధి కాంక్షించే వాళ్ళైతే అమరావతిని రాష్ట ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం మాకొద్దు, మాకొద్దు అంటూ తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో చేతులకు సంకెళ్ళు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. సంక్షమాల పేరిట పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం, మహిళలను నడిరోడ్డు మీద నిలబెట్టిన ప్రభుత్వం మాకొద్దు, మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీతోనే మహిళా సాధికారత : యరపతినేని

పిడుగురాళ్ళ, మార్చి 8: రాష్ట్రంలో టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అలవికాని హామీలిచ్చిన జగన్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయాడని ఆరోపించారు. పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం వున్న చంద్రబాబు, యువతకు మంచి భవిష్యత్ ఇవ్వాలన్న ఆశయంతో ఉన్న పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల కోసమేనని గుర్తుచేశారు. కలలకు రెక్కలు అనే సరికొత్త పథకాన్ని మహిళల కోసం టీడీపీ, జనసేన నేతలు తీసుకురావడం జరిగిందన్నారు. ఇంటర్ పూర్తిచేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ రుణాలకు టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం హామీగా వుంటుందని, అంతే కాకుండా మహిళలు తీసుకునే రుణానికి వడ్డీ కూడా టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ఎన్నికలలో ఓటమి తప్పదన్నారు. మహిళలకు మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ అన్నిరంగాల్లో వారు ముందుండాలని యరపతినేని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాండురంగ శ్రీను, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సీత, పాదర్తి రాజేశ్వరి, షేక్ నాగుర్‌బి, తదితరులున్నారు.

డీసీటీవో సస్పెన్షన్

● రూ.10 కోట్ల బిల్లుల భోగస్ క్లెయిమ్‌ల వ్యవహారంపై చర్యలు

గుంటూరు, మార్చి 8: బ్రాడీపేట సర్కిల్‌లో బోగస్ డీలర్ ఇన్‌వాయిస్‌ల క్లెయిమ్ వ్యవహారంలో డీసీటీవో మంజులపై సస్పెన్షన్ వేటు పడింది. బోగస్ డీలర్ నుంచి రూ.10 కోట్ల వరకు వాణిజ్య పన్నులశాఖ ఖజానాకు నష్టం కలగటంపై జరిపిన విచారణలో డీసీటీవో నిర్లక్ష్యం తేలటంతో ఆ శాఖ చీఫ్ కమిషనర్ గుల్జార్ సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే బ్రాడీపేట సర్కిల్‌లో మహీంద్ర కాటన్ పేరుతో ప్రొప్రయిటర్ యర్రబోతుల మహీంద్ర రెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకొని వ్యాపారం నిర్వహించారు. కాగా బోగస్ ఇన్‌వాయిస్ బిల్లులు సృష్టించి క్లెయిమ్‌లు చేసుకోవటంతో సీటీ శాఖకు రూ.10 కోట్ల నష్టం కలిగినట్లు అధికారులు గుర్తించారు. అసలు విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బ్రాడీపేట సర్కిల్ ఏసీగా వ్యవహరిస్తున్న స్వామి వివేకానంద సదరు కాటన్ వ్యాపారి అడ్రస్‌కు వెళ్ళి పరిశీలించగా అక్కడ ఎవరూ లేకపోవటంతో పాటు బోగస్ వ్యాపార సంస్థ అని తేలినట్లు విచారణలో తేలింది. ఇందులో డీసీటీవో నిర్లక్ష్యం కారణంగా కోట్లలో నష్టం కలిగినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. డీసీటీవో సస్పెన్షన్ వ్యవహారం ఆ శాఖ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది.

పోలీసుల అదుపులో టీడీపీ నేతలు

మాచర్ల రూరల్, మార్చి 8: పోలీసులు ఇరువురు టీడీపీ నేతలను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణంలో గత నెల 28వ తేదీన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నేపథ్యంలో టీడీపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వైసీపీ నేతలు ఆ ఫ్లెక్సీలను చింపివేయడంతో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో 12 మంది టీడీపీ నేతలపై పట్టణ పోలీస్‌స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులోని ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ శరత్ బాబు తెలిపారు. మిగిలిన వ్యక్తుల కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న ఇరువురు టీడీపీ నేతలను శనివారం కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు. కాగా పోలీసుల అదుపులో విద్యాధరణి మురళి, నర్రా గురవారెడ్డి ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● శుభకార్యానికి వెళుతుండగా ఘటన


మృతి చెందిన జానీ బాషా, జమాల్

దాచేపల్లి, మార్చి 8: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న ఇరువురు వ్యక్తులు మలుపు వద్ద వున్న గోతులను తప్పించబోయి వాహనం జారిపడగా వారిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే తీవ్రగాయాలపాలై మృతి చెందిన ఘటన శుక్రవారం దాచేపల్లి మండలం తంగెడ గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన షేక్ జానీబాష(45), సయ్యద్ జమాల్(50) వారి సమీప బంధువులు. జాన్‌పాడ్ దర్గాకు ఓ శుభకార్యం కోసం వేమవరం నుంచి ద్విచక్ర వాహనంపై వారిరువురు బయలుదేరారు. తంగెడ డీఏవీ స్కూల్ సమీపంలో వున్న గోతులను తప్పించబోతుండగా ఒక్కసారిగా వాహనంపై నుండి కిందపడ్డారు. రోడ్డుపై పడిన ఇరువురు వ్యక్తులపై నుంచిఇ వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లింది. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00



శ్రీఉమామహేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నరేంద్రవర్మ

శ్రీ ఉమామహేశ్వరిస్వామికి వేగేశన ప్రత్యేక పూజలు

బాపట్ల,మార్చి 8 : బాపట్ల పట్టణం 12వ వార్డు శివన్నారాయణపురంలో ఉన్న శ్రీఉమామహేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా బాపట్ల టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నరేంద్రవర్మను కాలనీవాసులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

శ్రీగంగా పార్వతిసమేత ఓంకారలింగేశ్వరస్వామికి...

బాపట్ల రూరల్, మార్చి8 : బాపట్ల మండలం అప్పికట్లలో శ్రీగంగా పార్వతి సమేత ఓంకారలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం స్వామి కళ్యాణోత్సవం వైభవంగా వేదపండితులు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవానికి బాపట్ల టీడీపీ,జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పాతనందాయపాలెంలో కొత్త ఓటరు నమోదు

బాపట్ల,మార్చి 8 : మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపెయన్ కార్యక్రమం బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నరేంద్రవర్మ ఆదేశాల మేరకు కర్లపాలెం మండలం పాతనందాయపాలెం 125వ బూత్, కొత్తనందాయపాలెం 124వ బూత్‌లలో న్యూ ఓటరు ఎన్‌రోల్మెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం రెండు చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, పార్లమెంట్ మహిళా కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, షేక్ నజ్మా, పాతనందాయపాలెం గ్రామ పార్టీ ప్రెసిడెంట్ రావి శ్రీనివాసరెడ్డి, కొత్తనందాయపాలెం గ్రామపార్టీ ప్రెసిడెంట్ రావి రాంబాబురెడ్డి, నాగిరెడ్డి, శవనం శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, ఆట్ల యశ్వంతరెడ్డి, కావూరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

బాపట్ల, మార్చి 8 : బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నెహ్రూయువకేంద్ర యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజేశ్వరి ప్రారంభించారు. ఈ పోటీలలో వాలీబాల్ క్రీడలో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా, ముత్తాయపాలెం విద్యార్థులు రన్నర్స్‌గా, కబడ్డీలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విన్నర్స్‌గా, బాపట్ల కబడ్డీ టీమ్ రన్నర్స్‌గా నిలిచారు. అనంతరం గెలుపొందిన జట్లుకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ కిరణ్మయిదేవిరెడ్డి, నేషనల్ యూత్ వలంటరీ త్రినేత్రరెడ్డి, పీడీ కత్తి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బాపట్ల, మార్చి 8 : ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో మహిళలు మరింతగా రాణించటం ద్వారా సంపూర్ణ సాధికారిత సాధించగలుగుతారని సత్యశోధన్ సమాజహిత భావప్రకటన సంస్థ అధ్యక్షులు, న్యాయవాది తమలపాకుల భాస్కరరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్ ఆవరణలో సంస్థ తరుపున మహిళలకు స్వీట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గేరా ఆనంద్, బండికిషోర్, ముత్యాలరామకృష్ణ, అరిగేల పద్మావతి, గేరా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్త అతహార్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో రవీందర్, బాపట్ల సీడీపీవో శైలజ తదితరులు

● పిట్టలవానిపాలెం, మార్చి 8 : మండలంలోని చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని నదిముల్లాపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న షేక్ అతహార్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్, బాపట్ల సీడీపీవో శైలజ, చందోలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి పలువురి చేతులమీదగా శుక్రవారం అతహార్‌ను బాపట్లలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చందోలు అంగన్‌వాడీ సెక్టార్ కార్యకర్తలు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, మార్చి 8 : కర్లపాలెం సచివాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యదర్శి మోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారిని దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మహిళా ఉద్యోగులందరికి మహిళా దినత్సోవ శుభాకాంక్షలు తెలిపారు.



కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారిని సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

పెన్షన్‌దారులకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలి : సీపీఐ

బాపట్లటౌన్, మార్చి 8 : వృద్ధులకు, దివ్యాంగులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెన్షనర్లకు రూ.4 వేలు పెంచుతామని ప్రకటించడం అభినందించదగ్గ విషయమని కాని ప్రస్తుతం పెరిగిన ధరలకు కనీసం నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా భవననిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, గీతకార్మికులు, ముఠాకార్మికులు గా పనిచేస్తున్న వారికి 50 సంవత్సరాలకు పెన్షన్ ఇవ్వాలని, ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదిరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● ప్రియురాలు ఎలుకల మందు తినడంతో మనస్థాపం

కొల్లూరు, మార్చి 3 : ప్రియురాలు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో ఆమెకు ప్రాణహాని జరుగుతుందేమోనని మనస్థాపంతో ప్రియుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరు కెటి కాలనీకి చెందిన కల్లూరి ప్రియాంక ఇంటికి గత నెల 27వ తేదీన మండల పరిధిలోని క్రాపకు చెందిన గుడిపూడి కిరణ్ భార్య శిరీష వెళ్లి దాడి చేసింది. తన భర్తకు, ఆమెకు వివాహేతర సంబంధం కారణంగా ఇంటికి రావడం లేదంటూ ఆరోపిస్తూ ఈ దాడికి పాల్పడింది. దీనిపై బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి తల్లి రాజ్యలక్ష్మి, కిరణ్, అతని భార్య వల్ల తన కూతురు ఈ అఘయిత్యానికి పాల్పడిందని, వారి వల్ల తన కుమార్తెకు ఇబ్బంది లేకుండా చూడాలంటూ గత సోమవారం స్పందనలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై స్పందించిన ఎస్పి కార్యాలయ సిబ్బంది ఆ ఫిర్యాదును వేమూరు సిఐకు బదలాయించారు. ఈ నేపథ్యంలో సీఐ రామకృష్ణ ఈ నెల 5న కిరణ్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అతని వెంట వచ్చిన పెద్ద మనుషులు రేపు మాట్లాడుకుని మళ్లీ వస్తామంటూ అతనిని కూడా తీసుకు వెళ్లారు. స్వగ్రామం క్రాప చేరుకున్న కిరణ్ భార్యతో ఘర్షణ పడి ఇంటి నుండి బయటకు వచ్చి తన ప్రియురాలు చావుబతుకుల మధ్య ఉందని మనస్థాపంతో అదే రోజు పురుగు మందు తాగాడు. గమనించిన పెద్ద మనుషులు, అతని సోదరుడు ప్రథమ చికిత్సకు వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తిప్రపత్తులతో మహాశివరాత్రి పూజలు

● శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు

బాపట్లరూరల్, మార్చి 8 : బాపట్ల మండలంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా గ్రామాలలో ఉన్న శివాలయాలకు తెల్లవారుజామునే భక్తులు స్వామివారిదర్శనం కొరకు పోటెత్తారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో ఉన్న శ్రీగంగా అన్నపూర్ణా విశాలక్ష్మీసమేత కాశీవిశ్వేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలకు కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామివారికి రథోత్సవ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని అదేవిధంగా ఆదివారం మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యనిర్వాహణాధికారి నిమ్మగడ్డ రవికుమార్ తెలిపారు. అదేవిధంగా బాపట్ల మండలం నాగేంద్రపురం గ్రామంలో ఉన్న నాగేంద్రస్వామి దేవాలయ ఆవరణలో మహాశివరాత్రి తిరునాళ్ళను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. విద్యుత్‌ప్రభలు, కోలాట భజనలు ఆకట్టుకున్నాయి.



అప్పికట్లలో శ్రీగంగా అన్నపూర్ణావిశాలక్ష్మీసమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

● బాపట్ల, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వారణాసి నుంచి తెప్పించిన పంచముఖ రుద్రాక్షలను బాపట్ల శివాలయంలోని భక్తులకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర యువమోర్చా ట్రెజరర్ కృష్ణచైతన్య పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆ పరమశివుని ఆశీస్సులతో దేశంలో బీజేపీ పాలన సుభిక్షంగా సాగాలని నరేంద్రమోదీ మరలా ప్రధానమంత్రి అవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాచన మణికుమార్, గురుస్వామి మిరపకాయల సుబ్బారావు, శివస్వాములు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, మార్చి 8 : మండలపరిధిలోని చందోలు గ్రామంలో శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలు నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు ఆలయ కార్యనిర్వాహణాధికారి జినరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో 100 సంవత్సరాల సాలగ్రామ చింతమణి శిలతో కూడిన లింగోద్భవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు చందోలు ఆర్యవైశ్య సంఘం సౌజన్యంతో లడ్డు, పులిహోర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకస్వాములు దండిభొట్ల తారకరాంబాబు, వెంకటసుబ్బయ్య శ్రీనివాసశాస్త్రి, బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మంతెనవారిపాలెం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో, ఖాజీపాలెంలోని శ్రీకాశీవిశ్వనాధస్వామి ఆలయంలో, అల్లూరు పంచాయతీలోని రెడ్లపాలెం శివాలయంలో మహశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు



భక్తులుచే పూజలు అందుకున్న సాలగ్రామ చింతమణి శిలతో కూడిన మహాలింగం



శ్రీవిద్యాచైతన్య పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చిత్రం

● కర్లపాలెం, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు శివాలయాలలో శుక్రవారం అర్చకులు విశేష పూజలు, పలు అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. కర్లపాలెం శివాలయంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన శివన్నారాయణ విశేష పూజలు నిర్వహించి సురేష్ పెయింట్‌వారు ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నల్లమోతువారిపాలెం శ్రీ విద్య చైతన్య పీఠంలో మాజీ ఎంపీపీ మాడా వెంకటరత్నం, మాడా శ్రీనివాసరావు దంపతులు శివాలయంలో విశేష పూజలు నిర్వహించారు. కర్లపాలెంలోని ఆదిశేషయాగ శక్తి పీఠం వద్ద శ్రీనాగేంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వక అన్నాభిషేక కార్యక్రమాన్ని అర్చకులు కిషోర్ నిర్వహించారు. మండలంలోని శివాలయాలన్నిటిని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేశారు. కర్లపాలెంలోని కొత్తనందాయపాలెంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరి అమ్మవారి దేవాలయంలో మహారుద్రాభిషేక హోమాన్ని నిర్వహించారు.

● అమృతలూరు, మార్చి 8 : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం మండల పరిధిలోని గోవాడ శ్రీబాలకోటేశ్వ స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం భక్తులతో పోటెత్తింది. స్వామి దర్శించుకునేందుకు లక్షలాది భక్తులు తరలివచ్చారు. గురువారం సాయంత్రం ఆలయ ప్రభ ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అర్ధరాత్రి రెండు గంటలకు అభిషేకాలకు, స్వామి దర్శనంకు భక్తులను అనుమతించారు. అభిషేక మండపంలో స్వామి వారికి అభిషేకాలు జరిపించుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ట్రాక్టర్లు, సవారీ బండ్లపై భక్తులు తరలివచ్చారు. రేపల్లె, తెనాలి ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, అన్నాబత్తుని శివకుమార్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు విస్తృతంగా ఏర్పాటు చేయడంతో పోలీసులు, దేవదాయ సిబ్బంది, పర్యవేక్షణలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల తర్వాత క్రమంగా భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. రేపల్లె, తెనాలి ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, అన్నబత్తుని శివకుమార్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, వేమూరు వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. సీఐ సీహెచ్‌ఎల్‌ఎన్ శ్రీనివాసరావు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం జరిగేలా పర్యవేక్షించారు. ఏర్పాట్లను సీఎఫ్‌వో గద్దె అమర్నాథ్, పాలక మండలి చైర్మన్ అలపాటి రమాదేవి, సభ్యులు పర్యవేక్షించారు. దాత విష్ణుమొలకల లక్ష్మీవరప్రసాద్ తాగునీటి ప్యాకెట్లను అందజేశారు. భక్తులకు శ్రీబాలకోటేశ్వర, కన్యకాపరమేశ్వరి, ఆర్యవైశ్య శ్రీయెనిశెట్టి రంగనాయకుల శ్రేష్ఠి అన్నదాన సత్రం, కాకతీయ సేవా సమితి, శాలివాహన (కుమ్మరి), లీలీ భవానీ పద్మశాలీయ సంఘం, బ్రహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.



అభిషేక మండపంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

దాతలను విస్మరించిన అధికారులు

ఆలయ అభివృద్ధికి సహకారం అందించిన దాతలను అధికారులు విస్మరించారు. స్వామి దర్శనానికి వచ్చిన దాతలను ఈవో పట్టించుకోలేదన్న విమర్శలు వచ్చాయి. అధికార పార్టీకి చెందిన ఓ నేతకు వీఐపీ క్యూ బాధ్యత అప్పగించడంతో ఆయన అధికార పార్టీకి చెం దిన వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్న విమర్శలు వచ్చాయి. కుటుంబాలతో దర్శనానికి వచ్చిన దాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

భక్తులసేవలో తరించిన సత్రాలు

మహాశివ రాత్రి పర్వదినం రోజున ఉత్సవాలకు విచ్చేసిన భక్తుల సేవలో అన్నదాన సత్రాలు తరించాయి. ఆలయం సమీపంలోని శ్రీబాలకోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య శ్రీయెనిశెట్టి రంగనాయకుల శ్రేష్ఠి అన్నదాన సత్రంలో ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, జిల్లాల నుంచి ఎంతో మంది ఆర్యవైశ్యులకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ ఏడాదితో 61 సంవత్సరాలు దిగ్విజయవంతంగా పూర్తి చేసినట్లు సత్రం అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు తెలిపారు. 15 వేల మంది పైబడి అన్నదానం చేసినట్లు చెప్పారు. ఏర్పాట్లను తాండవకృష్ణ, కొమ్మూరి మురళీకృష్ణ, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పొట్టి శ్రీధర్, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, తమ్మన సాంబశివరావు, కపలవాయి శ్రీనివాసరావు, కొత్తమాసు వెంకటరమణకుమార్, శ్రీకాకుళం సుధాకర్, చీమకుర్తి మొహనవెంకటేశ్వరరావు, నేరెళ్ళ వెంకటసుబ్బారావు, మలిశెట్టి వరప్రసాద్‌రావు పర్యవేక్షించారు. ఆయా సామాజిక వర్గాలు భక్తులకు అన్నదానం చేశారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న అన్నదాన సత్రం అధ్యక్షులు సాంబశివరావు, కమిటీ సభ్యులు

● భట్టిప్రోలు, మార్చి 8 : శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శైవ క్షేత్రాలు శివరామ స్మరణతో మారుమోగాయి. భట్టిప్రోలులోని దక్షిణ ముఖ శివాలయంగా పేరుగాంచిన శ్రీ కంచికామాక్షీ సమేత బాలకోటేశ్వరస్వామి దేవస్థానంకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. మండలంలోని వెల్లటూరులో ఉన్న అతి పురాతనమైన దేవాలయం, అగస్త్య మహర్షిచే ప్రతిష్ఠించిన శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత అగస్తేశ్వరస్వామి దేవస్థానంలో ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సూక్త విధానంలో అమ్మవారికి కుంకుమ పూజలతో పాటుగా మహా శివరాత్రి పూజా కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని సూరేపల్లిలో గ్రామంలో ఉన్న శ్రీ కేదారేశ్వర వాయిలింగం ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం, తిరునాళ్ళ, విద్యుత్ ప్రభల ఊరేగింపును శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. వల్లూరు విశ్వేశ్వరబాబు గురుస్వామి ఆధ్వర్యంలో మేళ తాళాలు, కేరళ తిరక్కం, కర్ణాటక వేదనాధం, కాంతార నృత్యం, కోయ నృత్యం, బేతాళ నృత్యాలు, వీరభద్ర నృత్యాలతో స్వామివార్ల ఊరేగింపును అంగరంగ వైభవంగా జరిపించారు.



సూరేపల్లిలో వాయు లింగం వద్ద స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

● కొల్లూరు, మార్చి 8 : భక్తులతో శైవ క్షేత్రాలు పోటెత్తాయి. మండల పరిధిలోని కోటిపల్లి సత్యజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీసోమశేఖరస్వామి ఆలయంలో పశు పోషకులు తమ మూగజీవాలను తోడ్కొని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈ సంప్రదాయం ఎన్నో దశాబ్ధాలుగా అనవాయితీగా వస్తుంది. చిలుమూరు ఉభయ రామక్షేత్రంలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఆయా గ్రామాల్లోని శైవ క్షేత్రాల్లో కూడా భక్తులు తరలి వచ్చి శివనామస్మరణతో ప్రత్యేక పూజలు జరిపారు.



ప్రత్యేక అలంకారంలో సోమశేఖరస్వామి

● వేమూరు, మార్చి 8 : మండల పరిధి గ్రామాలలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శివాలయాలలో వార్షిక ఉత్సవ సేవలు నిర్వహించారు. తెల్లవారు ఝామున సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నమక చమకాలు పంచసూక్తాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపి విశేషంగా అలంకరించి బిల్వ పత్రాలు పవిత్ర పుష్పాలతో అష్టోత్తర సహస్రనామ పూజలు జరిపారు. సాయంత్రం గ్రామోత్సవాలు ఆలయ ఉత్సవాలు శాంతి కళ్యాణ మహోత్సవాలు జరిపారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో స్వామివారికి పంచామృత అభిషేకం జరిపారు. ప్రతి శివాలయంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు జరిపించారు. పెంపుడు జంతువుల క్షేమాన్ని కోరి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. చావలి వాలేశ్వరాలయంలో జరిగిన అఖండజ్యోగి ప్రజ్వలన కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. జంపని రామేశ్వరాలయంలో శాంతి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపారు. అనేక ప్రాంతాల భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.



జంపని రామేశ్వరస్వామి



వివేకానందకాలనీలోని భావదేవనగర్‌లో పూజలు నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

భావదేవనగర్‌లో చండీహోమం

బాపట్ల,మార్చి 8 : పట్టణంలోని వివేకానందకాలనీ భావదేవ నగర్‌లో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా స్ఫటికలింగం, మెరువలింగం, శ్రీచక్రంతో 5 జాముల అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తజనం పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. పండితులు గోటేటి శ్రీనివాసరావు, శిఖరం ఫణిరాజశర్మ, గంటచిన్న, మదుశిష్యబృందం కార్యక్రమాన్ని జరిపారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

● స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే అనగాని

రేపల్లె, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు శుక్రవారం శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడులను తీర్చుకుని స్వామిని దర్శించుకుని తరించారు. రేపల్లె మండలం అరవపల్లిలో ఉన్న శ్రీ గంగాపార్వతి సమేత బాలకోటేశ్వ రస్వామి దేవాలయంలో అర్ధరాత్రి నుంచి స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, వివిధ పళ్ళ రసాలతో అభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. మండలంలోని దక్షిణ కాశీగా పేరొందిన మోర్తోట శ్రీ ముక్తేశ్వరస్వామి దేవాలయాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తూ తమ భక్తిని చాటుకున్నారు. చిన్నారులు సైతం బాల ప్రభలను ఏర్పాటు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అంతేకాకుండా పశువులను, ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలను, వాహనాలను ఆలయాల చుట్టూ తిప్పారు. మహాశివరాత్రి సందర్భంగా బాలకోటేశ్వరస్వామికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూలమాలలు దుశ్శాలువాలు వేసి సన్మానించారు. మహాశివుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయానికి తెల్లవారుఝాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకం పూజలలో పాల్గొన్నారు. గ్రామదేవత అయిన గొల్లబామకు భక్తులు సద్ది నైవేద్యాలు, పొంగళ్ళు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆధ్వర్యంలో సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. బాలకోటేశ్వరస్వామి దేవాలయం ముందు 70 అడుగుల భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవోలు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, కొపనాతి రాజశేకర్, దండమూడి ధరణికుమార్, పంతాని సాయికుమార్, దేవగిరి రవిశంకర్, రేపల్లె సురేష్, కేసన రామకృష్ణ, వడ్డి లక్ష్మీజీ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ బాలకోటేశ్వరస్వామివారు



శ్రీ బాలకోటేశ్వరస్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

అదేవిధంగా మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయం, పట్టణంలోని శ్రీ స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం, ఇసుకపల్లిలోని శ్రీభ్రమరాంబ చెన్న మల్లేశ్వరస్వామి దేవాలయం, ఓల్డ్‌టౌన్‌లోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో, మండలంలోని బోడాయపాలెంలో చౌడేశ్వరస్వామి దేవాలయంలో, నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలోని శ్రీ గోకర్ణేశ్వరస్వామి, నిజాంపట్నంలోని శ్రీగోకర్ణేశ్వరస్వామి ఆలయాలలో, కొత్తపాలెంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మండలంలోని అరవపల్లి శ్రీబాలకోటేశ్వరస్వామికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జున్‌రావు, నియోజకవర్గ సమన్వయ కర్త ఈవూరి గణేష్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరితో పాటు సర్పంచ్ లోయ బాబు నాంచారయ్య పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణ పాల్గొన్నారు.

తిరునాళ్ళకు భారీగా తరలివచ్చిన ప్రభలు

మహాశివ రాత్రిని పురస్కరించుకుని చిన్న అరవపల్లి గ్రామంలో శివుడు విగ్రహంతో ప్రభను ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ తిప్పారు. రేపల్లె పట్టణం నుంచి హంసవాహనంలోని శివలింగాన్ని, ఉప్పూడి గ్రామం నుంచి ప్రభ, నల్లూరు పాలెం గ్రామం నుంచి, మునసబువారిపాలెం ప్రభ, భారీ జనసందోహంతో, డప్పు వాయిద్యాలతో, మైక్‌ల హోరుతో బాలకోటేశ్వరస్వామి ఆలయం చుట్టూ తిప్పి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఈ ప్రభలను ప్రజలు చూసి తరించారు.



మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 70 అడుగుల ప్రభ

పరిటాల యువసేన ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము ఆధ్వర్యంలో మహాశివరాత్రి భక్తుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రారంభించి అందించారు. వేదగాయిత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ అందించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మోపిదేవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 10వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అరుణశ్రీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరుణ శ్రీ సంఘం సభ్యులు జానం మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని బాలకోటేశ్వరస్వామి ఆలయ సమీపంలో వాసవీ క్లబ్ వనిత, మైత్రీ కపుల్స్ సంయుక్తంగా భక్తులకు శనగల ప్రసాదం పంపిణీ చేశారు. విశ్వేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద వైద్యులు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులకు గ్లూకోజ్, శక్తినిచ్చే టానిక్స్ మోకాళ్ళ నొప్పులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పలు తగలపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి : అనగాని

రేపల్లె, మార్చి 8 : ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట కుప్పలను తగలబెట్టిన వారిపై పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కోరారు. నగరం మండలం ధూళిపూడి గ్రామానికి చెందిన వెలగపూడి ఉదయ బాస్కర్, శామ్యూల్, కొండపల్లి సుబ్బారావుల సుమారు లక్షరూపాయలు విలువ చేసే వరికుప్పలను గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టి రెండు రోజులు అవుతున్న పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామంలో ఇలాంటి కక్షపూరితమైన పద్ధతులు ఉంటే ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టాలు కూడా వాటిల్లే ప్రమాదం ఉందని, పోలీసులు ఉన్నతాధికారులు దృష్టిసారించి కుప్పలను తగలబెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానికుల పోలీసులపై విచారించి శాఖాపరమైన చర్యలుతీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆపదలో ఉన్నవారికి అండగా టీడీపీ : మల్లాది

చెరుకుపల్లి, మార్చి 8 : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి టీడీపీ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆరుంబాక పంచాయతీలోని కామినేనివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గోపి, మునేశ్వరరావులకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అందించిన నగదును అందించారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.20 వేలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొహమాటం రాధాకృష్ణమూర్తి, గాదె సాంబశివరావు, నాగుల నరేంద్ర, ఈవూరి దుర్గాప్రసాద్, బట్టు శ్రీనివాసరెడ్డి, కోటయ్యస్వామి, వేముల మోహన్‌బాబు, సోమయ్య, బొలగాని రామారావు, అద్దంకి శ్రీనాథ్, రమణ మాస్టారు, అనగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శంభో శివశంభో..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివనామస్మరణం

అద్దంకి, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అద్దంకి మండలం కుంకుపాడులోని శివాలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. చినకాశీగా పేరుగాంచిన మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన మహన్యాస పూర్వక రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఈదా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఈవో కృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయంలో కల్యాణోత్సవము వైభవంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ దంపతులు, పలువురు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేయిస్తంభాల గుడి, కమఠేశ్వరాలయంతో పాటు పలు శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

చీరాలలో.. చీరాల, మార్చి 8: నియోజకవర్గంలోని శివాలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో వేకువ జామున ప్రత్యేక అభిషేకాలతో ప్రారంభమైన పూజలు తెల్లవారేవరకు కొనసాగాయి. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పేరాల శివాలయంలో భస్మాభిషేకం ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతర భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

పర్చూరులో.. పర్చూరు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు మండలంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పంచామృతాభిషేకాలతో స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పర్చూరులోని భీమేశ్వర ఆలయం, పర్చూరు, చెరుకూరు, దేవరపల్లి, అడుసుమల్లిలోని గౌరీశంకర ఆలయం, ఉప్పుటూరు, నూతలపాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో విశిష్ట పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పంగులూరులో.. పంగులూరు, మార్చి 8: మహాశివరాత్రి వేడుకలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని దేవతామూర్తులను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంగులూరు, చందలూరు పరిసర గ్రామాలలో భక్తులు శివనామం స్మరిస్తూ భజనలు చేశారు. రామకూరు కొండపైగల రామలింగేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

మేదరమెట్లలో.. మేదరమెట్ల , మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని అన్ని శివాలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం వేకువజాము నుంచే మహాశివుడికి అభిషేకాలు, విశేషపూజలు, రుద్రనామాలు నిర్వహించారు. దైవాల రావూరులోని ఉమామహేశ్వర ఆలయం, మేదరమెట్లలోని మల్లేశ్వరస్వామి, కనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయం, బొడ్డువానిపాలెంలోని భవ్యలింగేశ్వరస్వామి ఆలయం, కొరిశపాడు, రావినూతల, ప్రాసంగులపాడు, పమిడిపాడు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం ఊరేగింపు నిర్వహించారు. మేదరమెట్లలోని కనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ వడ్లమూడి సుబ్బారావు, టీడీపీ నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, మన్నె హనుమంతరావు, కర్నాటి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, మార్చి 8: మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి ఆలయాలలో మహాశివరాత్రి తిరునాళ్లను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. లింగోద్భవ కాలం నుంచే భక్తులు కైలాసనాథుని దర్శించుకొన్నారు. శైవ క్షేత్రాలు శివనామసర్మణతో మార్మోగాయి. రామకోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న ప్రతి భక్తునికి లడ్డు, ప్రసాదం, మినరల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బాలకోటేశ్వరస్వామి అన్నదాన కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆలయాల వద్ద డిజిటల్ మరియు విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన శివపార్వతులు, కనకదుర్గ అమ్మవారు, లక్ష్మీదేవి, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామి, దేవాలయాల కటౌట్‌లు, ఈఫిల్ టవర్ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

తిరునాళ్ల సందర్భంగా రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద మూడు భారీ డిజిటల్ ప్రభలు, బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆరు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభల వద్ద సినీ, టీవీ కళాకారులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, డీ టీమ్, జబర్దస్త్ సభ్యులు చేసిన కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు వేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

కడవకుదురు గంగా పార్వతి గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. చినగంజాం గంగాపార్వతి సమేత చిదంబరేశ్వరాలయం, పెదగంజాం ఈశ్వరాలయం, సంతరావూరు రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు గ్రామాల్లోని శివాలయాలకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు. శైవక్షేత్రాలు విద్యుత్ వెలుగులతో దేదీప్యమానంగా వెలుగులీనాయి. తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.



అద్దంకి: మణికేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వర స్వామి



చినగంజాం: ప్రత్యేక అలంకరణలో రామకోటేశ్వరస్వామి, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలు



మేదరమెట్లలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్



చినగంజాం: ప్రత్యేక అలంకరణలో బాలకోటేశ్వరస్వామి



అద్దంకిలోని పాత శివాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ దంపతులు, కౌన్సిలర్‌లు



చీరాల: పేరాల శివాలయంలో ప్రత్యేక అలంకరణలో లింగాకారంలోని స్వామివారు



పర్చూరు: అడుసుమల్లిలోని గౌరీశంకర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్మలు స్వీయ ఫాం- 7 దరఖాస్తులు

- చనిపోయిన వ్యక్తుల పేర్లతో వ్యవహారం
- ఇప్పటివరకు అధికారుల లాగిన్‌లోకి 1,099 దరఖాస్తులు
- మరో 1,500కు పైగా ఉంటాయన్న అనుమానాలు
- ఓట్ల తొలగింపునకు కొత్త ఎత్తుగడ

అద్దంకి, మార్చి 8: ఓట్ల తొలగింపు దరఖాస్తులలో చిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఏకంగా ఎప్పుడో చనిపోయిన ఓటర్ల పేరుతో స్వీయ ఫాం-7 దరఖాస్తులు అందటం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. అలాంటి ఓట్లను ఫాం- 7 ద్వారా తొలగించ వచ్చు, లేదా బీఎల్‌వోలు విచారణ చేసి తొలగించవచ్చు. అలాకాకుండా వాళ్ళే తమ ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేసుకున్నట్లు స్వీయ ఫాం- 7 దరఖాస్తులు అందటం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆత్మలు వచ్చి దరఖాస్తులు చేశాయేమో అని నవ్వుకుంటున్నారు. దీనిని బట్టి ప్రత్యర్థుల ఓట్ల తొలగింపునకు అధికారపార్టీ నేతలు పడరాని పాట్లు పడుతున్నట్లు తేటతెల్లం అవుతుంది.

ఈక్రమంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లను వాళ్ళే స్వయంగా తొలగించమని దరఖాస్తు చేసుకున్నట్లు వైసీపీ నేతలు కుట్రలు పన్ని వేరే లాగిన్‌ల నుంచి దరఖాస్తు లు చేసినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో శుక్రవారం వరకు బీఎల్‌వోల లాగిన్ కు 1099 స్వీయ ఫాం- 7 దరఖాస్తులు అసైన్ అయినట్లు తెలుస్తుంది. ఇంకా బీఎల్‌వోల లాగిన్‌కు రాని స్వీయ ఫాం-7 దరఖాస్తులు మరో 1500 వరకు ఉంటాయన్న అనుమనాలను ఆయా గ్రామాల టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

కొన్ని గ్రామాలలో అందిన స్వీయ ఫాం- 7 దరఖాస్తులను పరిశీలిస్తే బల్లికురవ మండలం గుంటుపల్లి, కొత్తపాలెంకు చెందిన గుంటుపల్లి శ్రీరామమూర్తి, ఏల్చూరి అంజమ్మ, సంపతి రాజ్యం మృతి చెందారు. వాళ్ళ పేర్లతో స్వీయ ఫాం- 7 లు దాఖలుయ్యాయి. ఇక అద్దంకి పట్టణంలో కొల్లిపర వీరయ్య, తాళ్ళూరి సత్యనారాయణ, జవ్వాజి పద్మజ, బొగ్గరపు నాగేశ్వరరావు మృతి చెందినా స్వీయ ఫాం- 7లు అందాయి. ఇలా నియోజకవర్గంలోని అత్యధిక గ్రామాలలో అందినట్లు తెలుస్తుంది. ఓటర్ల ప్రమేయం లేకుండా వీటిని దాఖలు చేసిన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు టీడీపీ నేతలు కోరుతున్నారు. తమ పేర్లతో స్వీయ ఫాం- 7 లు దాఖలు పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు ఓటర్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేసేందుకు కూడా సిద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



క్యాంపు కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, తదితరులు

మార్టూరు, మార్చి 8: మహిళలకు ఆస్తి హక్కులో సగ భాగం హక్కు కల్పించి ఆర్థిక స్వావలంబనకు పునాది వేసింది టీడీపీ అని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇసుక దర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో సెంటినీ, హెచ్‌సీజీ విజయవాడ, ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఎన్‌టీఆర్, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఈసందర్భంగా ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళా సంక్షేమం పట్ల తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని చెప్పారు. మహిళల అభివృద్ధి కోసం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరో కీలకముందడుగు వేసి కలలకు రెక్కలు అనే సరి కొత్త పథకానికి రూపకల్పన చేశారన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులతో మహిళలు చదువుకు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో నూతన పథకాన్ని శ్రీకారం చుట్టారన్నారు. రానున్నది తెలుగుదేశం జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని చెప్పారు. మహిళల అభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకువస్తారన్నారు. కార్యక్రమంలో జరుగుల సంధ్య, జయమ్మ, రమాదేవి, కృష్ణవేణి, శారద, నాగేంద్రమ్మ, రావిపాటి సంధ్య, పార్టీ నాయకులు తొండెపు ఆదినారాయణ, తొట్టెంపూడి భుజంగరావు, తాటి నాగేశ్వరరావు, తేల ప్రోలు సాంబశివరావు, శివరాత్రి శ్రీను, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, మార్చి 8: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ముందడుగు వేస్తూ పురుషులకు దీటుగా తమ శక్తియుక్తులను చాటుతున్నారన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా శ్రేణులతో పాటు, నియోజకవర్గంలోని పలుప్రాంతాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

కాగా, మహాశివరాత్రి పర్వదిన ప్రత్యేక పూజల్లో కొండయ్య పార్టీ శ్రేణులతో కలసి పాల్గొన్నారు. గొల్లపాలెంలోని గంగమ్మ గుడి, చీరాల శివాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చీరాలలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

ఆదర్శమూర్తులు.. అతివలు

చినగంజాం, మార్చి 8: పలు రంగాల్లో ఎంతో మంది విజేతలను వెనుక ఉండి నడిపించిన ఆదర్శమూర్తులు అతివలు అని ఎంపీడీవో యాబీ వరప్రసాద్, చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో కార్యాలయ ఏవో బి.కల్పన, ఏపీవో గోలి లక్ష్మీదేవి, రాజుబంగారుపాలెం సర్పంచ్ డి.భూలక్ష్మి, మోటుపల్లి, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం గ్రామ కార్యదర్శులు కత్తి శైలజ, కొండూరి సునీత, జి.ఉషనాగేశ్వరిలను ఎంపీడీవో, పలుశాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ పి.విభీషణ, ఏఈ డి.దాసు, ఏపీఎం అంజిబాబు, సంతరావూరు, చినగంజాం, పల్లెపాలెం, కొత్తపాలెం గ్రామ కార్యదర్శులు కె.కృపారావు, ఎ.మస్తాన్‌రావు, కె.నాగేంద్రబాబు, కె.బాబురావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అద్దంకిటౌన్, మార్చి 8: అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు వివిధ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక కోర్టు ఆవరణంలోని కక్షిదారుల భవనంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బుజ్జప్ప, అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎన్.శ్రావణిప్రియదర్శినితో పాటు రోటరీ క్లబ్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. న్యాయాధికారి శ్రావణిప్రియదర్శినితో పాటు రోటరీ క్లబ్ మహిళ సభ్యులను, మహిళ న్యాయవాదులను రోటరీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవనంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను నక్కా కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మహిళ పారిశుధ్య కార్మికులతో పాటు ఇతర రంగాలలో సేవా కార్యక్రమాలు చేసే 25 మంది మహిళలను సన్మానించారు. పట్టణంలో ని హెచ్‌ఈఎల్‌పీ -టీఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళ మండలి సభ్యులు బి.ఫణికుమారి, టీఎల్‌ఎఫ్ సభ్యులు నాగలక్ష్మి తదితరులు హాజరై కేక్ కట్ చేశారు.

బల్లికురవలో.. బల్లికురవ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండలంలోని అంబడిపూడిలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాశీదేవి, కాలేషాబాబు, కొండ్రగుంట శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం శక్తితో రాణించాలి

పంగులూరు, మార్చి 8: మహిళలు స్వయం శక్తితో ఎదిగి అన్ని రంగాలలో రాణించాలని సీకేఎస్ ఫౌండేషన్ నిర్వాహకుడు షరీక్ అన్నారు. పంగులూరులోని సీకేఎస్ ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయిని మిడిదొడ్డి లక్ష్మిని ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



అద్దంకి కోర్టు ఆవరణలో కేక్ కట్ చేస్తున్న న్యాయాధికారి శ్రావణి ప్రియదర్శిని, తదితరులు

అక్కా చెల్లెమ్మలకు నమ్మకద్రోహం

- చేయూత కాదు... జగన్‌రెడ్డి చేతివాటం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజం

అద్దంకి, మార్చి 8: ఆర్థిక సాయం పేరుతో రాష్ట్రంలోని అక్కా చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నమ్మక ద్రోహం చేస్తున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. అద్దంకి పట్టణంలో శుక్రవారం పలు కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే రవికు మార్ స్థానిక నేతలతో మాట్లాడారు. సీఎం ఇచ్చేది చేయూత కాదని చేతివాటమని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా రాష్ట్రంలో మహిళలు ఆనందంగా జరుపుకునే పరిస్థితి లేదన్నారు. ఎన్నిక లకు ముందు చేయూత పథకం కింద 45ఏళ్ళు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చాక, పెన్షన్ ఇవ్వకుండా ఐదేళ్ళకు కలిపి రూ.75 వేలు ఆర్థిక సహాయమని మడమ తిప్పటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌ర రెడ్డి చేసిన మోసంతో ఒక్కో మహిళకు లక్షా ఐదు వేల రూపాయల నష్టం జరిగిందన్నారు.

తెలుగుదేశం పార్టీ మహిళలను తోబుట్టువులుగా చూసి ఆస్తిలో సగభాగం అందించిన ఏకైక పార్టీ అని రవికుమార్ పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు చంద్రబాబు అమలుచేసిన అనేక పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. సొంత చెల్లికి ఆస్తిలో సగభాగం ఇవ్వని జగన్‌రెడ్డి మోసగాడు కాదా అని ప్రశ్నించారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని జగన్‌రెడ్డి రాష్ట్రంలోని ఆడబిడ్డలను ఉద్ధరిస్తాడా అని అన్నారు. జీతాలు పెంచాలని వేడుకున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్లను పోలీసులతో లాఠీచార్జ్ చేయించటం, రాష్ట్రాన్ని అత్యాచారాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చటం మహిళల పట్ల జగన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. జగన్‌రెడ్డి చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, రాబోయే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని మహిళలే గద్దె దించుతారని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు.



కాకానిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

గొట్టిపాటికి సంఘీభావం తెలిపిన ముస్లిం నేతలు

అద్దంకి, మార్చి 8: అద్దంకి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం నేతలు, మహిళలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను శుక్రవారం చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో కలిసి సంఘీభావం తెలిపారు.

టీడీపీ నేతలు దామా హనుమంతరావు, షేక్ మాబు, షేక్ రసూల్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ముస్లిం నేతలు, మహిళలు వెళ్లి సంఘీభావం తెలిపి టీడీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

వాహనచోదకులు, ప్రయాణికులకు కష్టాలే!

- సిద్ధం సభతో జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేత

మేదరమెట్ల, మార్చి 8: సీఎం జగన్‌మోహనరెడ్డి హాజరయ్యే సిద్ధం సభతో జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు. దీంతో దూరప్రాంత వాహనచోదకులు, ప్రయాణికులకు కష్టాలు తప్పవు. మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద జాతీయ రహదారి పక్కన ఈనెల 10న సిద్ధం సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. జాతీయ రహదారి పై త్రోవగుంట వద్ద నుంచి బొల్లాపల్లి టోల్‌ప్లాజా వరకు సిద్ధం సభకు వచ్చే వాహనాలు మినహా మిగిలిన అన్ని వాహనాలను దారి మళ్ళించేందుకు పోలీస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. నెల్లూరు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్ళే భారీ వాహనాలను ఒంగోలు నుంచి చీమకుర్తి, పొదిలి మీదుగా మళ్ళిస్తున్నారు. హైదరాబాద్ వైపు నుంచి ఒంగోలు వైపు వచ్చే భారీ వాహనాలను సంతమాగులూరు అడ్డరోడ్డు నుంచి వినుకొండ, మార్కాపురం, పొదిలి మీదుగా మళ్ళిస్తున్నారు. నెల్లూరు వైపు నుంచి హైదరాబాద్ వెళ్ళే సాధారణ వాహనాలను అద్దంకి మీదుగా నామ్ రోడ్డులో అనుమతిస్తారు.

ఒంగోలు వైపు నుంచి విశాఖపట్నం వైపు ఎన్‌హెచ్ 16పై వెళ్ళే వాహనాలను త్రోవగుంట, చీరాల, బాపట్ల మీదుగా మళ్ళిస్తారు. ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు, చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్ళే సాధారణ వాహనాలను త్రోవగుంట, చీరాల, పర్చూరు మీదుగా మళ్ళిస్తారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 16వ నెంబరు జాతీయ రహదారిపై గ్రోత్‌సెంటర్ నుంచి బొల్లాపల్లి టోల్‌ప్లాజా వరకు సిద్ధం సభకు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తామని, మిగిలిన వాహనాలను అనుమతించేది లేదని పోలీస్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీంతో ఆదివారం వాహన చోదకులు, ప్రయాణికులు కష్టాలు, చుట్టూ తిరుగుడు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్



రామాయపాలెంలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, మార్చి 8: పలు కుటుంబాలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని రామాయపాలెంలో గొట్టం రాంబాబు వెన్నుపూస ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగబాము చినలింగయ్య, గుంటుపల్లి తిరుపతిస్వామిలను పరామర్శించారు.

అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో కోటయ్యను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన మలాది స్వాములు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, కాకాని అశోక్, బొడ్డపాటి రవిబాబు తదితరులు ఉన్నారు.

దేవాలయం అభివృద్ధికి విరాళం

చీరాల, మార్చి 8: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య చీరాల మండలం బోయినవారిపాలెం దేవాలయం అభివృద్ధికి రూ.లక్షా 16వేల నగదును అందజేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బోయినవారిపాలెం ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి భారి విరాళం అందజేసి మాట్లాడారు. దైవకృప కోసం ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన సమన్వయకర్త పదవికి స్వాములు రాజీనామా

చీరాల, మార్చి 8: జనసేన పార్టీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటు న్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఆమేరకు జనసేన పార్టీ కార్యాలయానికి తన రాజీనామా లేఖను పంపారు. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల సమన్వయకర్త బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు రాజీనామా లేఖలో పేర్కొన్నారు. అయితే, పార్టీలో కొనసాగనున్నారు. దీనిపై పార్టీశ్రేణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

మాజీ జవాన్‌కు ఎమ్మెల్యే ఏలూరి నివాళి



జవాన్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 8: పర్చూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన మాజీ జవాన్ గేరా రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళులర్పించారు. జవాన్ మృతి చెందిన వార్త అందుకున్న ఏలూరి శుక్రవారం పర్చూరులోని రాజేంద్రప్రసాద్ నివాశానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుమారుడు గేరా స్వరాజ్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. జవాన్ సేవలను కొనియాడారు. నిశాలులర్పించిన వారిలో టీడీపీ నాయకులు షేక్ షంషుద్దీన్, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, పఠాన్ సమీర్, మల్లాది నరేంద్ర, చెరుకూరి చింపయ్య, కొల్లా శివరాంప్రసాద్, తంగెళ్ళ మల్లికార్జునరావు, లక్కిపోగు సుమన్, నండు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి కల్పనే లక్ష్యం'

సంతమాగులూరు, మార్చి 8: మండలంలోని పుట్టావారిపాలెం గ్రామంలో తెలుగు మహిళ నియోజకవర్గ విభాగం ఆధ్వర్యంలో "కలలకు రెక్కలు" కరపత్రం, గోడపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని అన్నారు.

కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటు తెలుగు మహిళా విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నాగబోతు సుజాత, సంతమాగులూరు మండలం తెలుగు మహిళ అధ్యక్షురాలు కొనికి గోవిందమ్మ, కామేపల్లి సర్పంచ్ గుండపునేని విజయలక్ష్మి, సయ్యద్ గౌసియా తదితరులు పాల్గొన్నారు.

రేపు గంగవరంలో మెడికల్ క్యాంపు

గంగవరం(ఇంకొల్లు), మార్చి 8: మండలంలోని గంగవరంలో ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ బాచంద్రం తెలిపారు. స్థానిక మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరిసరగ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

మేదరమెట్ల, మార్చి 8: సిద్ధం సభకు భారీ సంఖ్యలో ప్రజలు వస్తున్నందున వారి ఆరోగ్యానికి సంబంధించిన విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్.విజయమ్మ తెలిపారు. శుక్రవారం మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చిన ఆమె వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపై సమీక్షించారు. ఎండ వేడిమికి సొమ్మసిల్లి పడిపోవడం, ప్రమాదాలు, ఇతరత్రా అనారోగ్య కారణాల వల్ల మెడికల్ క్యాంపు వద్దకు వచ్చే వారిపట్ల జాగ్రత్తలు తీసుకొని చికిత్స చేయాలన్నారు.

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా వైద్యులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ అనిష్, నవ్య, జైసింహా, హరి, మనోజ్, అక్షిత, తదితరులు పాల్గొన్నారు.